# సోషల్ సెక్యూరిటీ – సేక్రెడ్ కౌ

రాధికా శాస్త్రి, Princeton Junction, NJ

"పోస్ట్" టకటకా వీధిగేటు గిలక ఆడించాడు పోస్ట్‌మాన్ రామారావు.

"ఏం రామారావ్, ఈ రోజు ఆగి పిలుస్తున్నావ్? రోజూ వరండాలో పడేసి వెళ్ళే వాడివిగా"" అంటూ జానకమ్మగారు హాలుగదిలోనుండి వీధి గుమ్మంలోకి వచ్చారు.

"చాలా రోజులయింది గదమ్మా మిమ్మల్ని చూసి. పలకరించి పోదామని. అబ్బాయిగారు ఉత్తరం వ్రాసినట్లున్నారమ్మా'' అంటూ కవరు ఇచ్చి వెళ్ళిపోయాడు. అదే ఇంట్లో ఏభైఏళ్ళపైగా ఉండడంవలన చుట్టుప్రక్కల కుటుంబాలన్నీ జానకమ్మగారికి సుపరిచితమే. పోస్ట్‌మన్ రామారావుకు ఐదూ పదీ ఇస్తూంటారు పండగకూ పబ్బానికి. కొడుకుల ఉత్తరాలు జాగ్రత్తగా తెచ్చి ఇస్తూంటాడని. జానకమ్మ గారి పెద్దబ్బాయి అమెరికా వెళ్ళి ముప్పై సంవత్సరాలు దాటింది. తర్వాత మరో ఇద్దరు కొడుకులు కూడ వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. జానకమ్మగారు పెద్దకోడలు పురిటికని పాతిక సంవత్సరాలక్రిందట అమెరికావచ్చి నాల్గునెలలుండి వెళ్ళారు. మంచి మాటకారి, బ్రతకనేర్చిన మనిషి. 'నొప్పించక తానొవ్వక ... ' అనే మనస్తత్త్వం కలది.

"జానకమ్మా! కొడుకు నుంచా ఉత్తరం" అంటూ గుమ్మంలోకి అడుగు పెట్టింది రెండిళ్ళవతలగా ఉండే సుసీలమ్మగారు.

"ఔను సుసీలా. ఉత్తరం కొడుకు నుంచేగాని వ్రాసింది కోడలు. బాబు ఉత్తరాలు వ్రాయడు. ఎప్పుడైనా ఆరు నెలలకొకసారి ఫోనులో మాట్లాడడమేగాని."

"పోనీలే జానకమ్మా. ఎవరు వ్రాస్తే ఏం. కోడలు వ్రాసిందని సంతోషించు. ఇంతకీ ఏమిటి విశేషాలు ఉత్తరంలో"" అంది సుసీలమ్మ.

"ఆ ... ఏముంటాయ్. డబ్బులు జాగ్రత్తగా చూసి ఖర్చు చేయమని. ఎవరిద్వారానో పంపిస్తున్నారుట వచ్చే వారంలో. వాళ్ళకి పిల్లెదిగి వస్తున్నారనీ, కాలేజీ చదువుల ఖర్చులు ఎక్కువగా ఉన్నాయనీ చాలా పురాణం వ్రాసింది కోడలు.''

"నీ ప్రయాణ సన్నాహ మెంతవరకూ వచ్చింది? పాస్ పోర్టులు వచ్చాయన్నావుగదా. టిక్కట్లు పంపిందా వనజ మరి?" అడిగింది జానకమ్మ.

"అన్నీ సిద్ధంగానే ఉన్నాయి. రెండువారాల్లో ప్రయాణం. అదే చెప్పిపోదామని వచ్చా.''

"కూతురి పురిటికోసం గదా వెడుతున్నావ్. రెండు చేతులా పని ఉంటుందిలే. ఉత్తరం వ్రాస్తూండు తీరిక చూసుకొని. నువ్వు లేకపోతే నాతో ఆప్యాయంగా మాట్లాడే వాళ్ళే కరువయి పోయినట్లుంటుంది." అంటూ గుమ్మందాకా వచ్చి కంట తడ పెట్టుకుంటూ సాగనంపింది సుసీలను జానకమ్మ. ఆవిడ స్మృతిపథంలో గతం సినిమారీలులా తిరుగుతోంది. పాతికేళ్ళనాటి జ్ఞాపకాలు నిన్న మొన్న జరిగినట్లు తెరలు తెరలుగా జ్ఞప్తికి వస్తున్నాయి. పిల్లలందరిలో పెద్దకొడుకంటే ఆవిడకు పల్లమాలిన ప్రేమ. భర్త తనకు నలభై వయసులోనే గతించాడు. పెద్ద అబ్బాయి ప్రయోజకుడై తన సంసారానికి అండగా ఉంటున్నాడు అప్పటినుండీ.

కోడలు పురిటికి తనను తీసుకు వెళ్ళాడు అమెరికా. మొదట్లో కొంచం కొత్త అనిపించినా అక్కడ జీవన విధానానికి తను త్వరలోనే అలవాటు పడింది. పీట్జా, బీరు పంటివి ఇష్టంగానే అలవాటయ్యాయి. మట్టిరోడ్డులో నడిచి వెళ్ళి కూరల బజారులో అమ్మిల దగ్గర బేరాలాడి కొనుక్కోవడం వంటివిలేకుండా హాయిగా ఎ సి కారులో కూర్చుని షాపింగు చెయ్యడం అంటే సరదాగా ఉండేది. వచ్చిన చిక్కల్లా కోడలికి సహాయం చెయ్యడంలోనే. మనుమరాలికి డయిపర్లు మార్చడం వగైరా పనులు చేయవలసి వచ్చి నప్పుడు, 'నా కాలంలో నాపిల్లలకు చేశాను తప్పక. ఇప్పుడమేమీ చెయ్యలేను బాబూ'' అంటూ రెక్లైనర్లో కూర్చుని కబుర్లు చెబుతూండేవారు ఇంటికి వచ్చిన స్నేహితులతో. ఆ తర్వాత మరొకసారి అమెరికా వెళ్ళి గ్రీన్‌కార్డ్ వచ్చిన తర్వాత అప్పుడప్పుడు విజిట్‌కి వెడుతూండడం పరిపాటయిపోయింది. దాని వల్ల ముగ్గురు కొడుకులకూ ఇండియా రావడం ఖర్చు తప్పుతుందని ఆవిడ ఊహ.

* * *

ఆరోజు వనజ హడావిడిగా ఉంది. తల్లి సుసీలమ్మ, తండ్రి పరంధామయ్య గారు వస్తున్నారు ఆ సాయంత్రం ఇండియానుండి. వీకెండ్ ప్రయాణపుతేదీ పెట్టుకుంటే కొంచెం టిక్కట్లు ఖరీదు ఎక్కువని వారం మధ్యలో బుక్ చేసింది. అందు వల్ల వర్క్‌నుండి కొంచెం త్వరగా ఇంటికి వచ్చి బయలుదేరింది భర్త శేఖర్‌తో కెన్నెడీ ఎయిర్‌పోర్ట్‌కు. ఎయిర్‌ఇండియా విమానం అదృష్టవశాత్తు నిర్ణీత సమయానికే వచ్చింది. కష్టమ్స్ తతంగం అంతా పూర్తి చేసుకుని బయటపడ్డ సుసీల, పరంధామయ్యగార్లకు కూతురు, అల్లుడిని చూడడంతో ప్రయాణపు అలసట అంతా తపీమని మాయమయింది. వారుండేది న్యూజెర్సీ. గంటన్నర ప్రయాణంచేసి ఇంటికి చేరారు. తల్లి తండ్రులకు ఇంటిలో వసతులన్నీ చూపించి ఏది ఎలా వాడాలో చెప్పింది వనజ. పరంధామయ్యగారు గవర్నమెంటు ఉద్యోగంనుండి ఈ మధ్యే రిటైరయ్యారు. ఇద్దరు కూతుళ్ళూ, ఇద్దరు కొడుకులూ ఉంటున్నారు అమెరికాలో. అమ్మాయి వనజ తనకు సాయం కావాలని వ్రాస్తే సరేనని వచ్చారు. ఇక్కడ కూతురి సంసారంలో పద్ధతులన్నీ క్రొత్తగా అనిపిస్తున్నాయి ఆయనకు. ఉదయమే లేచి వనజ, శేఖర్ లిద్దరూ హడావిడిగా తయారయి ఓ చేతితో కాఫీ కప్పుతో కారెక్కుతారు ఆఫీసులకి వెళ్ళడానికి. సాయంత్రం ఇంటికి వస్తూనే ఆరోజ చేయవలసిన పనుల జాబితాలో ఏం మిగిలి ఉన్నాయో చెక్ చేసుకొని రాత్రి భోజనం అయ్యాక కాసేపు టి.వి. చూసి పడుకోవడంతో రోజు ముగుస్తుంది. మర్నాడు అదే చర్విత చర్వణం.

వనజ డెలివరీ డేట్‌కి పదిరోజులు ముందుగా శలవు తీసుకుని ఇంట్లో ఉంది. తల్లి తండ్రులకు కొంత కాలక్షేపంగానే ఉంది కూతురు ఇంట్లో ఉండడంతో. కాని అదెంతకాలమో సాగలేదు. మనుమరాలు పుట్టిన నెలరోజులకే ఉద్యోగంలో చేరిపోయింది. ఇక సుసీలమ్మ,

పరంధామయ్యలకు ఇంటి బాధ్యత, మనుమరాలి పెంపకంతో, కాలం ఎలా గడుస్తోందో తెలియనంతగా నాల్గు నెలలూ గడిచి తిరిగి వెళ్ళే రోజు దగ్గర పడుతోంది.

"మా ప్రయాణం దగ్గర పడుతోంది గదమ్మా వనజా. రిజర్వేషను చేయించావా'' అన్నారు పరంధామయ్యగారు.

"లేదు నాన్నా. మీవీసా మరొక ఆరునెలలు పొడిగించాం. మీరు నాదగ్గరే ఉంటే బేబీ విషయం నాకు బెంగ ఉండదు. బయట నర్సరీలో వదలాలంటే భయం నాకు.'' అంది వనజ చాలా కేజువల్‌గా. పరంధామయ్యగారికి ఏమనడానికీ తోచలేదు. కూతురు తన సాయం కావాలంటోంది. బాగుండదని ఊరుకున్నారు. కాలం గడుస్తోంది. మనుమరాలి మొదటి పుట్టినరోజ వైభవంగా జరిగింది. మర్నాడు పరంధామయ్యగారు కూతుర్ని అడిగారు,

"ఇంటికి వెళ్ళాలమ్మా '' అంటూ.

"రాజమండ్రిలో మునిగిపోయిన పనులు ఏమున్నాయి నాన్న మీకు. మీ ఇద్దరికీ గ్రీన్ కార్డ్‌కు ఏర్పాయి చేశాం. ఇక్కడే ఉండురుగాని మాతో. మాకు మాత్రమెవరున్నారు ఇక్కడ'' అంది వనజ. పరంధామయ్యగారు సున్నితమనస్తత్త్వం గల మనిషి. పోనీలే. ఇండియాలో మాత్రం ఎవరున్నారు. పిల్లందరూ ఇక్కడే ఉన్నారు గదా. కొంతకాలం వాళ్ళకు సహాయంగా ఉందామనుకుంటూ ఆరేళ్ళకాలం గడిపేసారు. గ్రీన్‌కార్డ్ వచ్చింది. తర్వాత సోషల్ సెక్యూరిటీ చెక్స్ కూడా ప్రతినెల ఇద్దరకూ వస్తున్నాయి. వనజ మరొక బిడ్డను కూడ కన్నది. పిల్లలిద్దరికీ స్కూలుకు వెళ్ళే వయస్సు వచ్చింది. సుసీలమ్మగారికి ఒంటరితనం బాధిస్తోంది.

సంక్రాంతి పండగ ఆరోజ. "ఏంపిండి వంటలు చెయ్యమంటావ్?'' అల్లుడిని అడిగింది. శేఖర్ నోటినుండి ఇంకా ఏమాటా రాకుండానే వనజ అందుకుంది. "బొబ్బట్లు మీ అల్లుడికి ఇష్టం అమ్మా. ఆ చేత్తోనే పెరుగుగారెలు, పులిహోర, కూరలు, పులుసు చేసెయ్యి. ఈ మధ్య ఎవరినీ డిన్నరుకి పిలవలేదు. ఓ పది ఫామిలీస్ ఉంటాయి. ఫోన్ చేస్తాను అందరికీ. నేను ఒక్కదాన్ని ఇంత వంట చెయ్యలేను."

ఇంతకీ ఆ రోజు శుక్రవారం. వనజ వర్కుకి వెళ్ళిపోయింది స్నేహితులని రాత్రి భోజనానికి పిలిచి. జానకమ్మగారికి మతిపోయినంత పనయింది వనజ మాటలు విని. డెబ్బయి ఏళ్ళు దగ్గర పడుతున్న మనిషి. సాయంత్రంలోపుగా ఎలా చెయ్యగలనా ఇంత వంటా అని కంగారు తో కదిలారు వంటింటిలోకి. పరంధామయ్యగారు స్వతహాగా పాకశాస్త్రంలో కుతూహలం గల మనిషి. భార్య కంగారు చూసి, ధైర్యం చెప్పి, బొబ్బట్లు వండడం, పిండి రుబ్బి గారెలు వేయడం వంటి పనులు తను చూసుకుని, భార్యా భర్తలిద్దరూ మొత్తానికి పదార్థాలన్నీ తయిరుచేసి టేబిలుపై అమర్చి ఉంచారు వనజ వచ్చేసమయానికి. పార్టీ ముగిసి రాత్రి పడుకోబోతుండగా వాషింగ్టను నుండి కొడుకు ప్రభాకరం ఫోనుచేశాడు.

"నాన్నగారూ! నేను, రమ హవాయి కాన్ఫరెన్స్‌కు వెడుతున్నాం. పదిరోజులపాటు మీరు అమ్మ వచ్చి ఇంట్లో బాబు రవితో ఉండాలి." సరేనని సుసీలమ్మ, పరంధామయ్య గార్లు కొడుకు దగ్గరకు వెళ్లారు. ప్రభాకరం , రమ ఇద్దరూ డాక్టర్లు. వారిల్లు ఇంద్రభవనంలా ఉంది.

పిళ్ళొచ్చినరకూ క్రిందభాగంలో గెస్టు రూము అన్ని వసతులతో ఉంది. కూతురు వనజ దగ్గర ఉన్నప్పుడు రెండుపూటలా భోజనమే చేసేవారు. కోడలు దగ్గరకు వచ్చాక ఆ అలవాట్లో మార్పులు వచ్చాయి.

"రోజూ రెండుపూటలా అన్నం, ఆవకాయలూ వగైరా తింటే శరీరానికి మంచిది గాదు. మీకు బి.పి. సుగర్ ఉన్నాయి గదా. ఉప్పు, తీపి తినకూడదు. పైగా మీకు హెల్త్ ఇన్సూరెన్స్ కూడ లేదు. ఏదైనా వస్తే ఖర్చు భరించలేం" అంటూ అన్నీ కంట్రోల్లో ఉంచింది కోడలు రమ. జిహ్వ చచ్చిపోయినట్లయింది సుసీలమ్మగారికి పథ్యపు భోజనంతో.

ఓ సాయంత్రం తోచక కొడుకు ఇంట్లోనే ఉన్నాడు గదా అని అడిగారు,

"ప్రభాకరం గుడికి వెడతావురా " అని.

"ఆ గుళ్ళు గోపురాలకు తీసుకు వెళ్ళే ఓపికలేదు నాకు. ఆ పూజలేవో మనస్సులోనే చేసుకో. ఇంట్లో ధూపం, దీపం రోజూ వెలిగిస్తే ఇల్లంతా పట్టేస్తుంది వాసన" అన్నాడు ప్రభాకరం.

ఏమనడానికి నోరు రాలేదు ఆవిడకు. మరొక కూతురు కమల బోస్టనులో ఉంది. ఆవిడ దగ్గరకు వెళ్ళారు చూద్దామని జానకీ పరంధామయ్యలు. కమలకు సంతానంలేదు. అల్లుడు ఉద్యోగరీత్యా తరచూ దేశం తిరుగుతూ ఉంటాడు. కమలకూడ ఉద్యోగం చేస్తుంది. కొంచెం ఓవర్‌వెయిట్ వలన చాలా స్ట్రిక్ట్ గా ఉంటుంది ఆహార విషయంలో. తల్లి తండ్రులకు తమ ఇద్దరికోసం చేసుకు తినడానికి ఇబ్బందిగా ఉండేది. కొద్దికాలం గడిచింది. ఓరోజు అన్నారు పరంధామయ్యగారు కమలతో.

"కమలా! మనస్సు ఇంటిమీదకు మళ్ళిందమ్మా. ఆరేళ్ళపైగా అయింది గదా వచ్చి. బుద్ధి అటువైపు తిరుగుతోంది జ్ఞాపకాలతో ."

"సరే నాన్నా. అలాగే చూద్దా" మంటూ తల్లి తండ్రుల ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ చేసి ఎక్కించింది విమానం. బొంబాయినుండి స్వగ్రామం చేరుకున్నాక ఆయన ప్రాణం స్థిమిత పడింది. 'జననీ జన్మ భూమి' అన్నారు మరి మనవాళ్ళు. వారంరోజులు విశ్రాంతి తీసుకున్నాక తన చిన్ననాటి నేస్తం జానకమ్మను చూడటానికి బయలుదేరింది సుసీలమ్మగారు. గుమ్మంలోకి అడుగు పెట్టిన సుసీలను చూసి మొహంమింతైంది జానకమ్మకు.

"రా సుసీలా! ఎప్పుడు తిరిగి వచ్చా" రంటూ యోగక్షేమా లయాక "అమెరికా విశేషాలేమిటి. అన్ని ఏళ్ళుండిపోయారేమిటి అమెరికాలో. నువ్వులేక నాకు రోజులు యుగాలుగా గడిచాయనుకో". జానకమ్మ మొహంలో ఎంతో కుతూహలం, మరెన్నో ప్రశ్నలు పోటీపడుతున్నాయి.

"ఏం చెప్పమంటావ్ జానకమ్మా. ఎళ్ళే వరకే మనవంతుగాని రావడానికి మనకు స్వతంత్రం లేదుగదమ్మా" అంది సుసీలమ్మగారు. ఆశ్చర్యంగా చూసింది జానకమ్మ.

"అమ్మాయి వనజకు సాయం అవసరమైనంత వరకూ బాగానే ఉంది. కావాలని మమ్మల్ని ఉంచేసుకున్నారు. పిల్లదిగి స్కూలుకు వెళ్ళడం మొదలుపెట్టాక బరువయిపోయాం అందరికీ. ఎప్పుడు బయట పడదామా అనిపించింది ఆ రొంపిలోనుండి." అంది సుసీలమ్మ.

"అదేమిటి సుసీలా అలా మాట్లాడుతున్నావు. నువ్వు కట్టిన చీర, వంటిపై నగలు చూస్తూంటే మీ పిల్లలు మిమ్మల్నెంత అపురూపంగా చూసుకున్నారో తెలుస్తూనే ఉంది." అంది కొంచెం కనిపించని అసూయతో.

"ఔనులే. దూరపు కొండలు నునుపంటారు మరి. దగ్గరకెడితే కనిపిస్తాయి మిట్టపల్లాలు. అయినా ఈ చీరలూ, నగలూ మాసంతానం నువ్వనుకున్నట్లు మాపై ప్రేమతో ఇచ్చినవి కావులే.

"మరి?" ఆశ్చర్యంగా నోరు తెరిచింది జానకమ్మ.

"అమెరికాలో అరవైఅయిదు సంవత్సరాలు దాటిన పెద్దవాళ్ళకు గవర్నమెంటువాళ్ళు సోషల్ సెక్యూరిటి అని డబ్బులిస్తారుట. మా ఇద్దరికీ చెరొక మూడువందలు డాలర్లు వస్తున్నాయి గత మూడేండ్లనుండి. అదే ఈ చీరల వెనుకనున్న కథ" అంది సుసీలమ్మ కట్టుకున్న చీరను చేసుకుని మురిసిపోతూ.

"అమెరికా వాళ్ళు ప్రపంచంలో అన్నిటా ముందంజ వేసి నాయకులమంటారు అన్నింటిలో. ఇంత దమ్మలనుకోలేదు" అనుకుంటోంది జానకమ్మ స్వగతం - తనకు కూడ అటువంటి ఆదాయం తనకొడుకు ఎందుకు ఏర్పాటు చెయ్యలేదో అని బాధను మనసులోనే దిగమింగుతూ. ఇంతకూ జానకమ్మ గారికి తెలియని ఒక పరమరహస్యం - తనకొడుకు ఎవరకీ తీసిపోడనీ, ఆవిడకు కూడ ఆ సేక్రెడ్ కౌ నుండి ఆదాయం వస్తోందనీ, అందులోనుండే నెలకు మూడువేలరూపాయలు ఇంటి ఖర్చుకోసం పంపుతున్నారనే విషయం.

ఓ నాల్గు నెలలు గడిచిన తర్వాత సుసీలమ్మగారు భర్తతో "ఏమండీ, మళ్ళీ మనం తిరిగి అమెరికా ఎప్పుడు వెడదాం? వెళ్ళకపోతే ఇప్పుడు వచ్చే ఆరువందల డాలర్లు ఇవ్వడం మానేస్తారేమో" అంది డాలర్ల రుచి మరిగిన సుసీలమ్మ.

ఆరు బయట దొడ్లో మంచంమీద పడుకుని వెన్నెల అందాన్ని ఆస్వాదిస్తున్న పరంధామయ్యగారికి ఆవిడ మాటలు కించిత్ ఆశ్చర్యాన్ని నవ్వును తెప్పించాయి.

"జానీ, మన ఇంట్లల్ మనం స్వతంత్రంగా బ్రతుకుతూ, ఉన్నదాంట్లో తృప్తిగా గడిపే ఆనందం ఆ డాలర్లలోనూ, ఆ ఇంద్రభవనాలోనూ వస్తుందనుకోవడం నీ భ్రమ. ఒకరి అదుపాజ్ఞలో లేకుండా ఇలా స్వేచ్ఛగా మనకు తోచినది చేసుకుంటూ కాలాన్ని గడపగల్గడం ఎంత అదృష్టం! జీవితంలో మనం ఆ అదృష్టానికి దూరమయాం అక్కడ ఉండి. అనవసరమైన ఆలోచనలేమీ పెట్టుకోక హాయిగా గడుపుదాం శేషజీవితాన్ని" అంటూ ఇంట్లోకి దారి తీశారు నిద్రాదేవి పిలుస్తుండగా.

* * * * *

**(రచయిత్రి అనుమతి పూర్వకంగా పునఃప్రచురింప బడ్డది.**
**మొదట 'అమెరికా కథానికలు 'లో ప్రచురించ బడినది.)**




# CALL INDIA FOR 59¢ / MIN

## ANYTIME 24 HRS. / DAY - 7 DAYS / WK.

| Country | ¢/minute | Country | ¢/minute |
|---|---|---|---|
| Australia | 49 | Japan | 59 |
| Canada | 29 | Singapore | 59 |
| Hong Kong | 59 | UK | 39 |
| Bahamas | 59 | Norway | 59 |
| France | 59 | Switzerland | 59 |

(Minimum Purchase $100 & $5
Processing fee = 170 Minutes to India)

**No** Activation Fees
**No** Monthly Fees
**No** Added Surcharge
**No** Fine Print
**No** Switching Present Carrier
**No** Minimum Usage Required

**SEND YOUR CHECK OR MONEY ORDER TO:**

U.S. Universal INC.
N5152 Summit Drive
Fond du Lac, WI 54935

1-800-929-9996
Tel: 414-929-8696
Fax: 414-922-7024

Laxman Kailas, President

**DOMESTIC LONG DISTANCE LOW RATE CARDS ALSO AVAILABLE**